# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 05-01-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ విశాఖకు భారీగా ఐటీ కంపెనీలు తీసుకువస్తామని రాష్ట్ర విద్యా, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ వెల్లడించారు.
- ❖ రాష్ట్రంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగితే ఉపేక్షించేది లేదని హోం మంత్రి వంగలపూడి అనిత పేర్కొన్నారు.
- ❖ పేదల ఆస్తులను కాపాడేందుకు, రైతులను సుభిక్షంగా ఉంచేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నదని మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు.
- ❖ సంక్రాంతి పండుగ రద్దీ సందర్భంగా 52 ప్రత్యేక రైళ్లు నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే ప్రకటిచింది.

==========================

రాష్ట్రంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగితే ఉపేక్షించేది లేదని హోం మంత్రి వంగలపూడి అనిత పేర్కొన్నారు. విశాఖపట్నం కేంద్ర కారాగారాన్ని ఆమె ఈ రోజు సందర్శించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... కేంద్ర కారాగారంలో వివాదాస్పద ఘటనలపై విచారణ జరుగుతోందని, ఘటనలపై కమిటీ వేశామని చెప్పారు. 10 రోజుల్లో నివేదిక రాగానే.. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని అనిత తెలిపారు. విధులు సమర్థంగా నిర్వహించకపోతే సిబ్బందిపై కూడా చర్యలుంటాయని హోం మంత్రి తెలియజేస్తూ...

(వాయిస్ 24 సెకన్లు)

==========================

విశాఖలో ఈ నెల 8వ తేదీన జరగనున్న ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పర్యటనను విజయవంతం చేయాలని రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పిలుపునిచ్చారు. ప్రధానమంత్రి పర్యటన నేపథ్యంలో ఏర్పాట్లకు సంబంధించి మంత్రి నారా లోకేష్ నేతృత్వంలోని మంత్రుల బృందం విశాఖ కలెక్టర్ కార్యాలయంలో ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులతో ఈ రోజు సమీక్షా సమావేశం నిర్వహించింది. నరేంద్రమోదీ పర్యటనకు సంబంధించి పటిష్ట ఏర్పాట్లు చేయాలని అధికారులకు,

ప్రజాప్రతినిధులకు మంత్రుల బృందం దిశానిర్దేశం చేసింది. అలాగే రోడ్ షో, బహిరంగ సభకు ఘనంగా ఏర్పాట్లు చేయాలని సూచించింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... ఎన్డీయే ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మొట్టమొదటి సారిగా ప్రధానమంత్రి రాష్ట్రానికి వస్తున్నారని, ఇదొక చరిత్రాత్మక పర్యటన అని పేర్కొన్నారు.

==========================

నిరుద్యోగ యువతకు నైపుణ్యాల పై శిక్షణ, ఉపాది కల్పనపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి అన్నారు. పార్వతీపురం మన్యం జిల్లా సాలూరులో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ సంకల్ప పథకం కింద నిర్వహించిన "మెగా జాబ్ మేళా"ను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... నిరుద్యోగ యువత నైపుణ్యాల పెంపుపై దృష్టి పెట్టాలని, మెగా జాబ్ మేళాను సద్వినియోగం చేసుకుని జీవితంలో స్థిరాపడాలని ఆకాంక్షించారు.

==========================

వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఆలయ మాడ విధుల్లో ఏర్పాట్లను తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) చైర్మన్ బిఆర్ నాయుడు ఈరోజు పరిశీలించారు. ఏర్పాట్లలో మార్పులపై అధికారులకు పలు సూచనలు చేశారు. సామాన్య భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ... సామాన్య భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు, విజిలెన్స్, టీటీడీ సిబ్బందితో కలిసి అద్భుతమైన ఏర్పాట్లు చేశామని తెలియజేశారు. పెరుగుతున్న భక్తులకు అనుగుణంగా ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొంటూ...

(వాయిస్ 28 సెకన్లు)

==========================

చైనాలో గుర్తించిన మరో కొత్త వైరస్ హెచ్ఎంపివి - హ్యూమన్ మెటా న్యూమో వైరస్ కి సంబంధించిన కేసులు రాష్ట్రంలో ఎక్కడా లేవని రాష్ట్ర ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్ డాక్టర్ పద్మావతి ఈ రోజు ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. ఈ వైరస్ కారణంగా ప్రజలెవరూ భయాందోళనలు చెందాల్సిన అవసరం లేదన్నారు. ఈ వైరస్ సోకిన వారికి సాధారణ జలుబు - ఫ్లూ లాంటి లక్షణాలు వుంటాయని తెలిపారు. వైరస్ వ్యాప్తిని నిరోధించడానికి కోవిడ్ సమయంలో పాటించిన తరహాలోనే జాగ్రత్తలు పాటించాలని, 20 సెకన్ల పాటు సబ్బు నీటితో తరచూ చేతులను శుభ్రంగా కడుక్కోవాలని ఆమె సూచించారు.

విరామం

==========================

విశాఖకు భారీగా ఐటీ కంపెనీలు తీసుకువస్తామని రాష్ట్ర విద్యా, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. ఈ రోజు విశాఖలో పర్యటించిన ఆయన పాత్రికేయులతో మాట్లాడారు. రాష్ట్రంలో వివిధ ప్రాంతాలకు పరిశ్రమలు తరలివస్తున్నాయని అన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు కావాల్సిన ప్రతి ప్రాజెక్టును తెచ్చేందుకు కేంద్ర మంత్రులు ప్రయత్నాలను చేస్తున్నారని తెలిపారు. అన్ని ప్రాంతాలకు నీరు అందించే బాధ్యతను ఎన్డీయే కూటమి ప్రభుత్వం తీసుకుంటుందని స్పష్టం చేశారు. ప్రజలకు ఇచ్చిన పలు హామీలను ఇప్పటికే నెరవేర్చామని, తల్లికి వందనం, రైతులకు ఆర్థిక సహకారానికి ఇప్పటికే స్పష్టత ఇచ్చామని తెలియజేస్తూ..

(వాయిస్ 23 సెకన్లు)

==========================

సంక్రాంతి పండుగ రద్దీ సందర్భంగా 52 ప్రత్యేక రైళ్లు నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే ఈరోజు ఓ ప్రకటన విడుదల చేసింది. సికింద్రాబాద్, కాచిగూడ, చర్లపల్లి రైల్వేస్టేషన్ల నుంచి కాకినాడ, నర్సాపూర్, తిరుపతి, శ్రీకాకుళం ప్రాంతాలకు ఈ రైళ్లు నడపనున్నట్లు తెలిపింది. ఆయా ప్రాంతాలకు ఈనెల 6 నుంచి 18వ తేదీ వరకు ఇవి అందుబాటులో ఉంటాయని వెల్లడించింది.

==========================

పేదల ఆస్తులను కాపాడేందుకు, రైతులను సుభిక్షంగా ఉంచేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నదని రెవిన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. తిరుపతిలో పాత్రికేయులతో ఈరోజు మంత్రి మాట్లాడుతూ.. లాండ్ టైట్లింగ్ చట్టం రద్దు చేసి, లాండ్ గ్రాబింగ్ చట్టం తెచ్చామని తెలిపారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చుతూ, నూతన పరిశ్రమలను ఏర్పాటు చేస్తున్నామని వెల్లడిస్తూ..

(వాయిస్ 26 సెకన్లు)

==========================

తెలుగు రాష్ట్రాల్లో రైల్వే అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని కేంద్ర రైల్వే, జలశక్తి శాఖ సహాయ మంత్రి వి. సోమన్న ప్రకటించారు. శ్రీ సత్యసాయి జిల్లా పెనుకొండలో రైల్వే శాఖ చేపట్టిన అభివృద్ధి పనులను ఈ రోజు ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సోమన్న మాట్లాడుతూ... ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ఎన్డీఏ ప్రభుత్వం పని చేస్తున్నదని అన్నారు. భారతదేశాన్ని అన్ని రంగాలలో అగ్రగామిగా నిలిపేందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అహర్నిశలు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. తెలుగు రాష్ట్రాల్లో రైల్వే అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని మంత్రి హామీ ఇచ్చారు.

==========================

విజయవాడలో రేపటి నుండి ప్రారంభం కాబోయే 68వ జాతీయ పాఠశాలల క్రీడల అండర్-19 బాలికల వాలీబాల్ టోర్నమెంట్ కు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు రాష్ట్ర పాఠశాల క్రీడల కార్యదర్శి, పరిశీలకులు జి.భానుమూర్తి రాజు తెలిపారు. సిద్ధార్థ ఆర్ట్స్, సైన్స్ కళాశాలలో ఈ నెల 10వ తేదీ వరకు జరిగే ఈ టోర్నమెంట్ లో వివిద రాష్ట్రాలకు చెందిన 26 జట్లు పాల్గొంటున్నాయని వివరించారు. ఈ పోటీలను సాయంత్రం ఫ్లడ్‌లైట్ వెలుగుల్లో జాతీయ స్థాయి వాలీబాల్ కోర్టులలో నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

==========================
==========================